ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
బుధవారం 6 మార్చి 2024

బెంగళూరు-కలబురగి మధ్య ప్రత్యేక రైలు

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బెంగళూరు బయ్యప్పనహళ్లిలోని ఎస్ఎంవీటీ నుంచి కలబురగికి ప్రత్యేక రైలు ను నడపాలని నైరుతి రైల్వేజోన్ అధికారులు నిర్ణయించారు. ఈ రైలు మార్చి 9 నుంచి ఏప్రిల్ 5 వరకు వారంలో ఒక రోజు రాకపోకలు సాగించనుంది. బెంగళూరు ఎస్ఎంవీటీలో ప్రతి శుక్రవారం రాత్రి 11 గంటలకు బయల్దేరే ఈ రైలు మరుసటి రోజు ఉదయం 9.50కు కల్బుర్గి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి శనివారం కలబురగిలో సాయంత్రం 5 గంటలకు బయల్దేరి ఆదివారం ఉదయం 4.15 గంటలకు బెంగళూరుకు చేరుకోనుంది.

వివాదాల సుడిగుండంలో సిద్ధూ సర్కార్ ఉక్కిరిబిక్కిరి

- పాకిస్తాన్ అనుకూల నినాదాల ఘటనతో మసకబారిన ప్రతిష్ట
- ఎన్నికలవేళ బీజేపీ చేతికి ఇవే బ్రహ్మాస్త్రాలు
- గ్యారెంటీల ఖ్యాతిని దెబ్బతీస్తాయా..?



బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిద్దరామయ్య సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వివాదాల సుడిగుండంలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతోంది. రాజ్యసభ ఎన్నికల వేళ విధానసౌధలో పాకిస్థాన్ జిందాబాద్ నినాదాల ఘటన, అనంతరం రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల ఘటనలతో ప్రభుత్వ ప్రతిష్ఠ కొంతమేరకు మసకబారిందనే చెప్పాలి. ఈ రెండు ఘటనల నుంచి బయటపడేందుకు తీవ్రంగానే కసరత్తు చేస్తోంది. ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నివేదిక (ఎఫ్ఎస్ఎల్) అందేంత వరకు ప్రభుత్వ చర్యలు నిదానగతిన సాగడం సర్వత్రా విమర్శలకు దారి తీసింది. లోక్‌సభ ఎన్నికల వేళ ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయోనని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. గోటితో పోయే దాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. సిద్దరామయ్య సారథ్యంలోని ప్రభుత్వంలో మంత్రులు చేసిన వ్యాఖ్యలు సైతం సమస్యను జఠిలంగా మార్చాయన్న వాదన వినిపిస్తోంది. ఈ చిక్కు సమస్య నుంచి కాంగ్రెస్ అంత త్వరగా బయటపడడం కష్టమేనన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఈ ఘటనలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఇంత వరకు స్పందించకపోవడం కూడా సోషల్ మీడియాలో దుమారం చెలరేగుతోంది.

బీజేపీకి ఇవే బ్రహ్మాస్త్రాలు

ఎన్నికలవేళ ఈ రెండు ప్రధాన అంశాలు బీజేపీకి బ్రహ్మాస్త్రాలుగా మారాయి. కాంగ్రెస్ కార్యకర్తలు పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు చేయలేదని నసీర్ సార్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారని వాదిస్తూ వచ్చిన కొందరు మంత్రులకు ముఖం చెల్లడం లేదని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ ఎద్దేవా చేశారు. ముగ్గురు కాంగ్రెస్ కార్యకర్తల అరెస్టుతో ఆ పార్టీ నిజస్వరూపం బయటపడిందన్నారు. అరెస్టు అయినవారు ముగ్గురూ ముస్లింలు కావడంతో గతంలో మండ్యలో జరిగిన ఘటనను వెలికితీసి హిందువులపై కేసు నమోదు చేసేందుకు కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. రాష్ట్ర పర్యటనలో ఉన్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా ఈ రెండు అంశాలను ప్రధానంగా ప్రస్తావించడాన్ని బట్టి చూస్తే రానున్న ఎన్నికల్లో వీటి ద్వారా గరిష్ఠంగా లబ్ధి పొందాలన్నదే వ్యూహంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రధాని నరేంద్రమోదీ కూడా ఇవే అంశాలను ప్రస్తావించి హిందూ ఓట్లను సంఘటిత పరిచే అవకాశం ఉందని తెలుస్తోంది. దేశద్రోహానికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలతోపాటు రాజ్యసభ ఎంపీ నాసిర్ సయ్యద్ హుసేన్‌పై కూడా చర్యలు తీసుకోవాల్సిందేనని బీజేపీ తాజాగా డిమాండ్ చేయడం వెనుక పెద్ద వ్యూహమే కనిపిస్తోంది.

గ్యారెంటీల ఖ్యాతిని దెబ్బతీస్తాయా..?

తాజా వివాదాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రభుత్వం ఐదు గ్యారెంటీలపై దీని ప్రభావం ఏ మేరకు ఉంటుందనే అంశంపై ఆందోళన చెందుతోంది. గ్యారెంటీలపైనే కొండంత ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలు ప్రస్తుత పరిణామాలపై ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వే ర్వేరు ప్రక టనల్లో దేశద్రోహుల శక్తుల విషయంలో రాజీ పడే ప్రశ్నే లేదన్నారు. రామేశ్వరం కెఫెలో బాంబు పేలుళ్ల కేసును ఎన్ఐఏకు అప్పగించాలని ఇప్పటికే ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ పేలుళ్ల వెనుక ఉగ్రవాద కోణం ఉందని అనుమానిస్తున్న సంగతి తెలిసిందే. పాక్ అనుకూల నినాదాల విషయంలోనూ ఎవరినీ రక్షించే ప్రశ్నే లేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉత్తరకన్నడ జిల్లా పర్యటన సందర్భంగా స్పష్టం చేశారు. దర్యాప్తు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా సాగేందుకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ఈ వ్యవహారంపై రాద్ధాంతం చేస్తోందని విరుచుకుపడ్డారు. ఇప్పటికే పలు వివాదాలు నెత్తినేసుకుని ఆపై అప్రమత్తమవుతూ వచ్చిన కాంగ్రెస్ పాలకులు ఈ రెండు తాజా వివాదాల నుంచి ఏ విధంగా బయటపడతారో వేచి చూడాలి.



బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను సన్మానిస్తున్న నాయకులు

టార్గెట్ 28 అందుకుందాం

- దక్షిణాదిన కర్ణాటకే కీలకం
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా



బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మొత్తం 28 లోక్‌సభ స్థానాలనూ కైవసం చేసుకునే దిశలో ముమ్మరంగా కృషి చేయాలని జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యకర్తలు పిలుపునిచ్చారు. బెళగావిలో మంగళవారం ఆయన పార్టీ కోర్ కమిటీ కీలక సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. దేశం కోసం మరోసారి 'మోదీ, మోదీకా ప రి వార్' నినాదాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి భారీ విజయం ఖాయమని, బీజేపీకి సొంతంగా 370 స్థానాలు, ఎన్డీయే కూటమికి 400 సీట్లు దక్కుతాయని ఇందులో దక్షిణాది కూడా కీలక పాత్ర పోషించనుందని చెప్పారు. దక్షిణాదిన కర్ణాటక బీజేపీకి స్కోరింగ్ స్టేట్ కానుందన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు మోదీ పాలనలో ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ కోర్‌కమిటీ కీలక సమావేశం లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అగర్వాల్, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడిగా ఉన్న మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప పాల్గొన్నారు.



పాల్గొన్న కార్యకర్తలు

మహాశివరాత్రికి 1500 ప్రత్యేక బస్సులు

- రవాణా, దేవదాయ శాఖల మంత్రి ఆర్.రామలింగారెడ్డి

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి వారాంతంలో వచ్చినందున ఊళ్లకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ ఈ నెల 7 నుంచి 11 వరకు 1500 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. రవాణా, దేవదాయ శాఖ మంత్రి ఆర్.రామలింగారెడ్డి నగరంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ బెంగళూరులోని కెంపేగౌడ బస్టాండ్, మైసూరు రోడ్డు శాటిలైట్ బస్టాండ్, శాంతినగర్ బస్టాండ్‌ల నుంచి ఈ ప్రత్యేక బస్సులు సంచరిస్తాయన్నారు. ప్రత్యేకించి ధర్మస్థళ, కుక్కే సుబ్రహ్మణ్య, శివమొగ్గ, హాసన, మంగళూరు, కుందాపుర, శృంగేరి, హొరనాడు, దావణగెరె, హుబ్బళ్లి, ధార్వాడ, బెళగావి, విజయపుర, గోకర్ణ, శిరసి, కార్వార, రాయచూరు, కల్బుర్గి, బళ్లారి, కొప్పళ, యాదగిరి, బీదర్, మైసూరు, హుణసూరు, పెరియపట్టణ, విరాజ్‌పేట, కుశాల్‌నగర, మడికేరిలకు ప్రయాణికుల రద్దీని బట్టి అదనపు బస్సులను నడపనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విజయవాడ నగరాలకు కూడా కేఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. ఒకేసారి ఐదుగురు ముందస్తుగా టిక్కెట్లను రిజర్వు చేసుకుంటే చార్జీలో 5 శాతం రాయితీ ఉంటుందని రానుపోను టికెట్లను రిజర్వుచేసుకునే వారికి 10 శాతం రాయితీ లభిస్తుందని ఆయన వెల్లడించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆన్‌లైన్‌లోనే 1202 ప్రభుత్వ సేవలు

- రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరెగౌడ

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలోని వివిధ శాఖలకు సంబంధించిన మొత్తం 1202 సేవలు మరో 8 నెలల్లో ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి రానున్నాయి. నగరంలో వివిధ శాఖల ఉన్నతాధికారుల 'సకాల' సమావేశాన్ని సోమవారం నిర్వహించిన రెవెన్యూ శాఖ మంత్రి కృష్ణబైరెగౌడ అనంతరం మీడియాతో మాట్లాడారు. సకాల పథకంలో ప్రస్తుతం 1082 ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. తాజాగా మరో 120 సేవలను తమ ప్రభుత్వం చేర్చిందన్నారు. మిగిలిన సేవలను కూడా సాధ్యమైనంత త్వరగా ఆన్‌లైన్‌లో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. దీని వల్ల సమయం ఆదా కావడంతో పాటు సకాల పరిధిలోకి రావడంతో అధికారుల జవాబుదారీ తనం పెరుగుతుందన్నారు. ఆన్‌లైన్ సేవలతో లంచాలకు కూడా బ్రేక్ పడుతుందన్నారు. తమ పనుల కోసం ప్రజలు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని తెలిపారు. మొత్తం 1202 ప్రభుత్వ సేవల్లో 922 సేవలు పౌరులకు సంబంధించినవి కాగా, 280 సేవలు ఉద్యోగులకు సంబంధించినవన్నారు. కాగా సేవా సింధు యాప్‌లో ప్రస్తుతం 802 సేవలు లభిస్తున్నాయని మంత్రి వివరించారు.



విధానసౌధ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ బృందం


ఎంపీ నాసిర్‌ను ఏ-1గా చేర్చాలి

- విధానసౌధ పోలీసులకు బీజేపీ ఫిర్యాదు

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల ఫలితాల సందర్భంగా ఫిబ్రవరి 27న చోటు చేసుకున్న పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు నిజమేనని ఎఫ్ఎస్ఎల్ నివేదికలో రుజువు కావడంతో కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు నాసిర్ హుస్సేన్‌ను ఏ1గా చేర్చాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఆయన సమక్షంలోనే కాంగ్రెస్ కార్యకర్తలు పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు చేశారని తేలడంతో కేసును తీవ్రంగా పరిగణించాలని కోరుతూ విధానసౌధ పోలీసులకు బీజేపీ బృందం మంగళవారం ఫిర్యాదు చేసింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందీశ్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు ఎమ్మెల్యే ధీరజ్ మునిరాజు, ఎస్సీ మోర్చా మాజీ అధ్యక్షుడు చినా రాము తదితరులు పాల్గొన్నారు. ఫిర్యాదు అనంతరం నందీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఫిబ్రవరి 27న తాము చేసిన ఫిర్యాదుకు అదనంగా మరికొంత సమాచారం చేర్చి తాజాగా సమర్పించామన్నారు.

కరువుపై సీఎం సమీక్ష

- వేసవి తీవ్రతను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు ఆదేశం



కరువు పరిస్థితిని సమీక్షిస్తున్న సీఎం సిద్దరామయ్య, చిత్రంలో పలువురు మంత్రులు

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరువు తాజా పరిస్థితిని ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మంగళవారం సమీక్షించారు. అధికార నివాసం కృష్ణలో జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, జిల్లా అధికారులు, జిల్లా పంచాయతీ సీఈఓతో సీఎం వీడియో సదస్సు నిర్వహించారు. జిల్లాలవారీగా కరువు తాజా పరిస్థితిని మదింపు వేశారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి హాహాకారాలు లేకుండా చూడాలని సూచించారు. కేంద్రప్రభుత్వం ఆదుకోకపోయినా 33.25 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.631.12 కోట్లను జమ చేశామన్నారు. 8 జిల్లాల్లోని 26 నగరాలు, పట్టణాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని, అందుబాటులో ఉన్న ప్రైవేట్ బోర్లను వినియోగించుకుంటున్నామన్నారు. ప్రస్తుత వేసవి కాలంలో 7,408 గ్రామాల్లో తాగునీటి సమస్య జఠిలంగా ఉండవచ్చునని అంచనా వేస్తున్నామని తెలిపారు. 7,340 ప్రైవేట్ బోరుబావుల నిర్వాహకులతో ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. తుంగభద్ర రిజర్వాయర్‌లో 1.78 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని, జూన్ వరకు దీన్ని జాగ్రత్తగా వాడుకోవాలని సూచించారు. నారాయణపుర, ఆల్మట్టి, మలప్రభ, ఘటప్రభ, కావేరి బేసిన్‌లో తాగునీటికి సరిపడా జలాలు ఉన్నాయన్నారు. నరేగా పథకంకింద రాష్ట్రానికి రూ.730 కోట్లు బకాయి రావాల్సి ఉందన్నారు. గ్యారెంటీ పథకాలను ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. పలు జిల్లాలలో బోరుబావులు తవ్వేందుకు రూ.46.90 కోట్లను విడుదల చేసినట్టు ప్రకటించారు. రాయచూరు, హావేరి, విజయపుర, విజయనగర జిల్లాల్లోనూ బెంగళూరు నగర, గ్రామీణ జిల్లాల్లో తాగునీటి సమస్య కొంతమేరకు జఠిలంగానే ఉందని సీఎం దృష్టికి అధికారులు తెచ్చారు. యుద్ధ ప్రాతిపదికన బోరుబావులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కరువు జిల్లాల్లో పరిస్థితిని అధిగమించేందుకు జిల్లా అధికారులకు పూర్తి అధికారాలు ఇస్తున్నామని తెలిపారు. 223 తాలూకాల్లో కరువు బారినపడగా వీటిలో 194 తాలూకాల్లో తీవ్రంగాను ఉందన్నారు. జిల్లా అధికారుల ఖాతాలలో రూ.854 కోట్లు అందుబాటులో ఉందన్నారు. అవసరమైతే అదనంగా మరో రూ.140కోట్లను తాగునీటికి రూ.70కోట్లను పశుగ్రాసం కోసం విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు సీఎం ప్రకటించారు. సమావేశంలో మంత్రులు కృష్ణబైరేగౌడ, చలువరాయస్వామి, సంతోష్‌లాడ్ పాల్గొన్నారు.

10న గురజాల జగన్‌మోహన్ ఆత్మీయ సమావేశం

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి చిత్తూరు నియోజకవర్గ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ ఈనెల 10న బెంగళూరు ప్రవాసాంధ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. సమావేశం బెంగళూరులోని చన్నసంద్ర వీవీ కన్వెన్షన్‌హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జరుగుతుందని నగరంలో మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో నిర్వాహకులు పేర్కొన్నారు. బెంగళూరులో స్థిరపడిన చిత్తూరు ప్రజలు ఈ ఆత్మీయ సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



గురజాల జగన్ మోహన్


పాఠశాలలకు మహర్దశ

- 'నమ్మశాలె - నమ్మ జవాబ్దారి' పథకానికి ముఖ్యమంత్రి శ్రీకారం



పాఠశాలలకు అవసరమైన సామగ్రిని పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కల్పించే 'నమ్మ శాలె - నమ్మ జవాబ్దారి' పథకాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన అధికార నివాసం కృష్ణలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే తాను ప్రకటించిన మేరకు సిద్దరామనహుండి, కుప్పేగాల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.10లక్షల విరాళాన్ని స్వయంగా అందచేశారు. ఈ కార్యక్రమానికి ముందు విద్యార్థులు రాజ్యాంగ పీఠికను చదివారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. రాజ్యాంగ పీఠిక కంఠస్థం చేస్తే చాలదని, దాని అర్థాన్ని తెలుసుకోవాలన్నారు. బుద్ధుడు, బసవేశ్వరుడు, అంబేడ్కర్ బోధనల సారాంశంతోనే రాజ్యాంగపీఠిక రూపుదిద్దుకుందన్నారు. స్వాతంత్ర్యం, సమానత్వం, సామరస్యం రాజ్యాంగం మూల ఉద్దేశ్యాలని, ఇవి అందరికీ దక్కాలని సీఎం ఆకాంక్షించారు. తాము విద్యను అభ్యసించినప్పుడు ఎలాంటి సదుపాయాలు లేవని, ఎంతో కష్టపడేవారమన్నారు. ప్రస్తుతం దాతల పుణ్యమా అని పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయన్నారు. ప్రాథమిక విద్యాశాఖ మంత్రి మధుబంగారప్ప మాట్లాడుతూ ఈ పథకానికి ఇంతవరకు పూర్వవిద్యార్థులు రూ.6కోట్లను అందించారన్నారు. 48వేల ప్రభుత్వ పాఠశాలల్లో 14వేల వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం కూడా రూ.44వేల కోట్లను పాఠశాలల అభివృద్ధికి కేటాయించిందన్నారు. సీఎస్ఆర్ నిధులతోపాటు నమ్మ శాలె - నమ్మ జవాబ్దారి పథకానికి కూడా తోడ్పాటు అందితే ఏ ప్రభుత్వ పాఠశాలలోనూ మౌలిక సదుపాయాల కొరత ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్ గోయెల్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1586.18	1,603.23
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	885	8,039
సామర్థ్యం (టీఎంసీలు)	8.12	25.99

భద్రతపై శ్రద్ధ వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగన్నగౌడ

బళ్లారి సిటీ, మార్చి 5: భద్రత చాలా ముఖ్యమని ఆర్‌పీసీఎల్ సంస్థ అధినేత నాగన్నగౌడ అన్నారు. తాలూకాలోని యశ్వంత్‌నగర్ సమీపంలో ఉన్న స్టీల్ ప్లాంట్‌లో జరిగిన 52వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒకరి మరణం ఒక్క కుటుంబానికే పరిమితం కాదని, సమాజానికి, దేశానికి, సంస్థకు స్నేహి తులకు, బంధువులకు కూడా నష్టమని అన్నారు. నేడు సరియైన భద్రత చర్యలు చేపట్టడంలేదని అందు వల్లనే ప్రమాదాలు జరగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కర్మాగారాలలో భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, రక్షణకవచాలు తప్పనిసరిగా ధరించి భద్రతా నియమాలు పాటించాలన్నారు.

ఆర్.సీ.పి.ఎల్ ప్లాంట్ చీప్ మేనేజర్ ఉమేశ్ భట్ మాట్లాడుతూ అనేక భద్రతా చర్యలు తీసుకున్నప్పటికీ ప్రమాదాలు జరుగుతున్నాయని, సురక్షితంగా ఉండడం ద్వారా వీటిని నివారించవచ్చన్నారు. కార్మికులు మరింత సురక్షితంగా పని చేయాలని, వాహనదారులు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ వినాయక్, ఉద్యోగులు గిరిధర్, మెకానిక్ రమేశ్, రాజశేఖర్ బెల్లాడ్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

జానకీ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో జాతీయ భద్రతా దినోత్సవం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అన్వర్ బాషా

బళ్లారి రూరల్, మార్చి 5: తాలుకాలోని సిడిగినమల సమీపంలో వున్న జానకీ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 53వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని జరుపుకున్నారు. సీనియర్ మేనేజర్ హెచ్‌ఆర్ అడ్మినిస్ట్రేషన్ అన్వర్ బాషా నేతృత్వంలో కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీ హళ్లి ఎస్‌ఐ నాగభూషణ మాట్లాడుతూ నిత్యం ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులు తమ విధుల్లో వున్న సమయంలో నిర్లక్ష్యం వహించకుండా వుండాలని తెలిపారు. కార్మికులకు భద్రతపై పలు సూచనలు చేశారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ కుమార్, రవి ప్రకాష్, ఎల్‌వీ శ్రీనివాస్, విశ్వనాథ్, రాజేష్, విశ్వానంద్, రవి కుమార్, ఎస్ఎం నాగశేఖర్, మల్లికార్జున, జడే స్వామి, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

నాణేలతో రామమందిరం



హొస్పేటలో నాణేలతో నిర్మించిన రామమందిరం

కంప్లి, మార్చి 5 : అయోధ్యలో దేశంలోనే గుర్తుండి పోయే రామమందిర నిర్మాణం జరిగిన సంగతి తెలిసిన విషయమే. కానీ విజయనగర జిల్లా హొస్పేట నెహ్రూ కాలనీలో వుంటున్న శ్రీరామభక్తుడు కోటేశ్వర రూ. పది వేల నాణేలతో అయోధ్య రామమందిర నిర్మించాడు. ఈ నాణేలతో నిర్మించిన రామ మందిరాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు.

లోక్‌సభ బరిలోకి దూకేదెవరో?

● బీజేపీ నుంచి శ్రీరాములు
● కాంగ్రెస్ నుంచి ఉగ్రప్ప, వెంకటేశ్ ప్రసాద్, సౌపర్నిక



సౌపర్నిక(కాంగ్రెస్)



బి. వెంకటేశ్ ప్రసాద్(కాంగ్రెస్)



వీఎస్ ఉగ్రప్ప(కాంగ్రెస్)



శ్రీరాములు(బీజేపీ)

బళ్లారి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు బళ్లారి లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో కుస్తీ పడుతున్నాయి. బీజేపీ నుంచి పోటీలో మాజీ మంత్రి శ్రీరాములు రంగంలో ఉంటారని బీజేపీ వర్గాలు సంకేతాలు ఇస్తున్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి ఎవరా? అనే విషయమై అన్వేషణ సాగుతోంది. కాంగ్రెస్ నుంచి మాజీ ఎంపీ ఉగ్రప్ప, మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్ ప్రసాద్, సండూరు ఎమ్మెల్యే తుకారాం కూతురు సౌపర్నిక తదితరులలో ఒకరిని పోటీలో నిలపాలని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. జేడీఎస్-బీజేపీ రెండింటి మధ్య పొత్తు ఏర్పడింది కాబట్టి జేడీఎస్ నుంచి ఎవరినీ పోటీకి నిలపకపోవచ్చు. గాలి జనార్దన్‌రెడ్డి స్థాపించిన కేఆర్‌పీపీ నుంచి అభ్యర్థులను పోటీలో నిలుపుతారా..?లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. అంతేకాకుండా ఆపార్టీ బీజేపీలో విలీనం అవుతుందని కూడా కొందరంటున్నారు. అలాకాకుండా ఆ పార్టీ లోక్‌సభ బరిలో అభ్యర్థిని నిలిపితే ఎవరి ఓట్లు చీలుస్తారనే విషయమై పలు సందేహాలు నెలకొన్నాయి. 1971 నుండి ఇప్పటి వరకూ జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సార్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. 2004లో ఈ నియోజకవర్గం ఎస్టీలకు రిజర్వ్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఎక్కువ సార్లు బీజేపీ అభ్యర్థులే గెలుస్తూ వచ్చారు. మధ్యలో 2019లో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి ఉగ్రప్ప విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేసిన దేవేంద్రప్ప విజయం సాధించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. జిల్లాలోని దాదాపుగా 14 నియోజక వర్గాల్లో 10 మంది కాంగ్రెస్ శాసనసభ సభ్యులే ఉన్నారు. ఈనేపథ్యంలో ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు సులభతరం కానుందని భావిస్తున్నారు. కానీ దేశవ్యాప్తంగా మోదీ గాలి వీస్తున్న నేపథ్యంలో బీజేపీకి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.

ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ కూడా ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాలని చూస్తోంది. ఈనెల రెండో వారం చివరిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉండడంతో అభ్యర్థుల ఎంపికపై రెండు పార్టీలూ వేర్వేరుగా సర్వేలు చేయించుకుంటున్నాయి. మొత్తంమీద నోటిఫికేషన్ అనంతరమే అభ్యర్థులెవరో వెల్లడయ్యే అవకాశం కన్పిస్తోంది.

ఉత్తమ సాహిత్యంతోనే సమాజంపై అవగాహన



మాట్లాడుతున్న డా. రెహమత్ తరికెరె

బళ్లారి సిటీ, మార్చి 05: నిస్సహాయ సమాజాన్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యం చదవాలని హంపి కన్నడ విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ రెహమత్ తరికెరె అభిప్రాయపడ్డారు. నగరంలోని సరళాదేవి కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెంటర్, కన్నడ విభాగం ఆధ్వర్యంలో 'సాహిత్యాన్ని ఎందుకు చదవాలి' అనే అంశంపై నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంబంధాలు తెగిపోతున్నాయన్నారు. కలిసి జీవించాలని, కలిసి తినాలని సాహిత్యం నేర్పుతుందన్నారు. సినిమా, నాటకం, సంగీతం, జీవితానికి లాభాన్ని కలిగించకపోయినా మనిషికి కావాల్సిన ప్రశాంతతను, ఆలోచనను, వ్యక్తిత్వాన్ని ఏర్పరచగలవని చెప్పారు. మనం ఒంటరిగా బతకాలని మార్కెట్ సంస్కృతి చెబుతోందన్నారు. అందరూ కలిసి మెలసి మన ఊరు, బంధువులను పర్యావరణాన్ని ప్రేమించాలన్నారు. మన మధ్య అమృతం, విషపు నదులు ప్రవహిస్తున్నాయని, ఏ నది నీటిని తాగాలనే విషయంలో మనం చైతన్యం తెచ్చుకోవాలన్నారు. ఏ సాహిత్యం చదవకపోయినా గౌరవప్రదంగా జీవిస్తున్న గ్రామీణ ప్రాంత నిరక్షరాస్యులు మనకు నిలువెత్తు నిదర్శనమన్నారు. ఈసందర్భంగా కన్నడ విభాగాధిపతి దస్తగిరసాబ్ దిన్ని, కళాశాల సహాయ ఆచార్యులు రామస్వామి,ప్రవీణ్‌కమార్, లింగప్ప, హుచ్చుసాబ్, బసప్ప, రాజశేఖర్, చన్నబసవన్న, వీరేంద్ర రవిహాల్, మంజునాథ్, ఇరాజ్ తదితరులు పాల్గొన్నారు.

24గంటల్లో తాగునీటి సమస్యకు పరిష్కారం

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం సిద్ధూ



వీడియో కాన్ఫరెన్స్‌లో బళ్లారి డీసీ, తదితర జిల్లా అధికారులు

బళ్లారి సిటీ, మార్చి 05: రాష్ట్రంలోని ప్రతిగ్రామం, వార్డుల్లో తాగునీటి సమస్య ఉండకూడదని, సమస్య తలెత్తితే ట్యాంకర్లు, ప్రైవేట్ గొట్టపు బావులతో సహా ఏదైన నీటి వనరుల నుంచి నీటిని సరఫరా చేసేందుకు 24గంటల్లో చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. హోం కార్యాలయం కృష్ణాలో బుధవారం జిల్లా ఇన్‌చార్జిమంత్రి, జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శులు, జిల్లాకలెక్టర్లు, జిల్లా పంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. రుతుపవనాలు సరిగా రాకపోవడంతో కరువు నెలకొన్నదన్నారు. దాదాపు 48లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని, ఏప్రిల్, మే నెలల్లో తీవ్ర కరువును ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో పరిశీలించి వెంటనే స్పందించాలని సూచించారు. కరువు వల్ల ప్రజలకు కలిగే సమస్యలను నివారించాలన్నారు. జిల్లాలో తాగునీరు. పశువులకు మేత ఇతర సమస్యలుంటే జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని 1077 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, జిల్లాఉప కలెక్టర్ మహ్మద్ జుబేరా, అధికారులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచాలి

బళ్లారి గాంధీనగర్, మార్చి 5: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా ఓటువేసే విధంగా ఓటరు జాగృతి కార్యక్రమాలు చేపట్టాలని జడ్పీ సీఈఓ, స్వీప్ సమితి నోడల్ అధికారి రాహుల్ శరణప్ప అధికారులకు సూచించారు. జిల్లా పంచాయతీ సభాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్వీప్ సమితి ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రజల్లో ఓటు విలువ గురించి తెలిపాలని, ఆ దిశగా అధికారులు అవసరమైన అవగాహన, జాగృతి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు రీల్స్, కవిగోష్టి, రోస్‌డే, బైక్ ర్యాలీ, సాహిత్య సమ్మేళనం, సెల్ఫీ బూత్, సుగమ సంగీతం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. గత ఎన్నికల్లో సండూరు తాలూకా పరిధిలోని జిందాల్ ఫ్యాక్టరీలో తక్కువ శాతం పోలింగ్ నమోదైందని, ఈ సారి కార్మికులకు పోలింగ్‌పై అవగాహన కల్పించే దిశగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని అపార్ట్‌మెంట్, బస్సు స్టేషన్, రైల్వే స్టేషన్‌లాంటి ప్రాంతాల్లో ఓటు జాగృతిపై ప్లెక్సీలు, ఎల్ఇడి వీడియో ప్రదర్శన లాంటివి ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి అడుగుల జెండాతో ర్యాలీ



సిరుగుప్ప, మార్చి 5 : సిరుగుప్ప పట్టణంలో మంగళవారం బీజేపీ పార్టీ కార్యకర్తలు తిరంగ యాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. హైస్కూలు మైదానం నుంచి గాంధీజీ సర్కిల్ వరకు వెయ్యి అడుగుల పొడవు గల జెండా యాత్ర విజయవంతంగా కొనసాగింది. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, ఎస్ఈఎస్ విద్యాసంస్థ విద్యార్థులు, పట్టణ ప్రజలు పాల్గొని తిరంగ యాత్రకు జేజేలు పలికారు.

వైభవంగా ఉడుసులమ్మ కుంభోత్సవం



ఇంటింటి నుంచి అలంకరించిన కుంభాలను తీసుకువస్తున్న మహిళలు

కంప్లి, మార్చి 5 : సిరిగేరి తాలుకా పరిధిలోని బాదనట్టి గ్రామంలో ఉడుసులమ్మ దేవి కుంభోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ప్రతి యేటా మార్చి నెలలో వడ్డట్టి దుగ్గులమ్మ దేవి, సింధిగేరి సుంకులమ్మ, షెహనాజ్ పుర సుంకుల పార్వతి దేవతల కుంభోత్సవ కార్యక్రమాలు ఆయా గ్రామాలలో కన్నుల పండువగా నిర్వహించుకుంటారు. ఉదయాన్నే గ్రామ పెద్దలు నీటి కుంభోత్సవం అనంతరమే అమ్మవారికి మొక్కులు సమర్పించుకుంటారు. గ్రామ పంచాయతీ, పోలీసు శాఖ ఎలాంటి సంఘటనలు జరుగకుండా గ్రామంలో చర్యలు చేపట్టారు. ఈ కుంభోత్సవం సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కురుగోడు పోలీస్ స్టేషన్ పోలీసులు ప్రతి రోడ్డుకు బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలు గ్రామంలోకి వెళ్లకుండా ట్రాఫిక్ నిబంధనలను విధించారు. మొత్తానికి ఉడుసులమ్మ కుంభోత్సవం బాదనట్టిలో కన్నుల పండువగా జరిగింది.

మోదీ హ్యాట్రిక్ కోసం మహిళ బైక్ ర్యాలీ



బుల్లెట్‌లో ర్యాలీ చేస్తున్న రాజ్యలక్ష్మి

బళ్లారి, మార్చి5(ఆంధ్రజ్యోతి): 2024లో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ కూటమి అఖండ మెజార్టీతో గెలిచి మళ్లీ నరేంద్రమోదీనే ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ రాయచూరు కు చెందిన రాజలక్ష్మి అనే మహిళ 15 రాష్ట్రాల మీదుగా సాగిస్తున్న బైక్ ర్యాలీ మంగళవారం విజయనగర(హొస్పేట్) కు చేరుకుంది. అక్కడ విలేకరులతో ఆమె మాట్లాడారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 12న బైక్ ర్యాలీ ప్రారంభించామన్నారు. తమిళనాడు, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని చిక్ బళ్లాపురం మీదుగా తిరిగి హొస్పేట్‌కు చేరామన్నారు. ఇప్పటికి 4,500 మీటర్ల ర్యాలీ సాగిందన్నారు. మొత్తం 15 రాష్ట్రాల మీదుగా బైక్ ర్యాలీ చేసి ఏప్రిల్ 18న 21 వేల కిలోమీటర్లు ప్రయాణించి డీల్లీకి చేరుకుంటామని తెలిపారు.

ఎవరీ రాజలక్ష్మి అంటారా...

లీగల్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీగా ఉన్న రాజలక్ష్మిది పూర్వం కర్ణాటకలోని రాయచూరు. ఆమె వారణాసిలో స్థిరపడ్డారు. ఆమె ఫిబ్రవరి 12న బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఆమె వెంట 24 మంది సభ్యుల బృందం ఉంది. వారందరూ వాహనాల్లో అనుసరిస్తుంటే ఆమె మాత్రం బుల్లెట్ బైక్‌పై ర్యాలీ చేస్తున్నారు.

విద్యార్థులకు నీటిపై యోగా శిక్షణ



నీటిపై యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కంప్లి, మార్చి 5 :సండూరు పట్టణంలోని 7, 8, 9 తరగతుల విద్యార్థులకు వేసవి శిబిరాలు ఏర్పాటు చేసినట్లు టీకేటీ సంస్థ నిర్వాహకులు నాగన్నగౌడ తెలిపారు. అందులో విద్యార్థినీ విద్యార్థులకు నీటిలో యోగా, ప్రాణాయామం చేయడం, ఇతర యోగాసనాలపై శిక్షణనిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు భూమిపైనే కాకుండా నీటిలో కూడా ధైర్యం కోసం ఈ యోగాసనాలు నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో శిక్షణ పొందుతున్నారన్నారు. విద్యార్థులు భయాందోళనను వదిలి ముందుకొచ్చినప్పుడే ఇలాంటి సాహసాలు చేయవచ్చునన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన అరుణాచారి(ఫైల్)

కంప్లి, మార్చి 5: కొట్టూరు తాలుకా తొలహళ్లి గ్రామానికి చెందిన అరుణాచారి (35) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతిచెందాడు. ఆయన సోమవారం కొట్టూరు రథోత్సవానికి వచ్చి తిరిగి తమ గ్రామానికి బైక్‌లో వెళుతూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. అరుణాచారికి బలమైన గాయాలు కాగా ఆస్పత్రికి వెళ్లి అనంతరం చికిత్స పొందుతూ మృతి చెందాడు. రథోత్సవానికి వెళ్లి తిరిగిరాని కుమారుడి మరణవార్త విని తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

హోసూరు జోన్

క్యాన్సర్‌ను ప్రారంభంలో గుర్తిస్తే చికిత్స సులభం



బ్రెస్ట్ క్యాన్సర్ ఆసుపత్రి ప్రారంభంలో ప్రముఖులు

హోసూరు, మార్చి 5: హోసూరు సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల ఆసుపత్రిలో మహిళల బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. హోసూరు బత్తలపల్లిలోని సెయింట్ పీటర్స్ మెడికల్ కళాశాల హాస్పిటల్ కృష్ణగిరి దాని పొరుగు జిల్లాల ప్రజలకు అద్భుతమైన వైద్య సేవలను అందిస్తోంది. ఈ ఆసుపత్రిలో మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ డిటెక్షన్ మామోగ్రామ్, ఫ్లూరోస్కాపీ వంటి ఆధునిక వైద్య పరికరాలతో కూడిన సదుపాయం ఉందని హోసూరు కార్పొరేషన్ వైద్యాధికారి డాక్టర్ ప్రభాకర్ తెలిపారు. హోసూరు ప్రాంతీయ కార్మిక సంక్షేమ ఆసుపత్రి (ఈఎస్‌ఐ) డాక్టర్ గీతా, హోసూరు ప్రైవేట్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ గౌరీ పాల్గొన్నారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాజా ముత్తయ్య స్వాగతోపన్యాసం చేశారు. ఇటీవలి కాలంలో మహిళలల్లో బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ సమస్యలు అధికమయ్యాయన్నారు. రొమ్ముల్లో గడ్డ, నొప్పి వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గైనకాలజిస్టును సంప్రదించి సరైన పరీక్షలు, చికిత్సలు పొందాలన్నారు. ప్రారంభ దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందన్నారు. అలాగే ఆసుపత్రిలో డాక్టర్ ముత్తులక్ష్మిరెడ్డి మాతృత్వ పథకం ద్వారా మొదటి రెండు ప్రసవాలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

మాదకద్రవ్యాల వ్యసనంపై జాగృతి

హోసూరు, మార్చి 5: రోజురోజుకు పెరిగిపోతున్న మాదకద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడేలా హిందూ యూత్ ఫ్రంట్ ఆధ్వర్యంలో జాగృతి చేపట్టారు. వ్యసనం వల్ల కలిగే దుష్ప్రభావాన్ని ప్లకార్డుల ద్వారా తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. అనంతరం డ్రగ్స్ నిషేధించాలని, యువత సంక్షేమాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ర్యాలీలో హిందూ యూత్ ఫ్రంట్ జిల్లా కో-ఆర్డినేటర్ దివాకర్, జిల్లా కార్యదర్శులు కార్తీ, ప్రేమ్, మున్సిపల్ ఇన్‌ఛార్జీలు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల సదుపాయం

హోసూరు, మార్చి 5: హోసూరు బారందూరు గ్రామంలోని పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో టైటాన్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో మరుగుదొడ్ల సదుపాయాన్ని కల్పించారు. పాఠశాల సమస్యపై ప్రధానోపాధ్యాయురాలు శారద, టైటాన్ ఇంజనీరింగ్ సంస్థను సంప్రదించగా సంస్థ సానుకూలం వ్యక్తం చేసింది. నవంబరులో పనులు చేపట్టగా ఇటీవల నిర్మాణాలు పూర్తయ్యాయి.

ఉత్సాహంగా ఎడ్ల పండుగ

హోసూరు, మార్చి 5: హోసూరు సమీపంలోని పిళ్ళైకొత్తూరులో సాంప్రదాయ ఎద్దుల పండుగ మంగళవారం ఉత్సాహంగా సాగింది. ప్రజలు నెల రోజుల క్రితం నుంచే ఇందుకు ఏర్పాట్లు చేశారు. ఎద్దులకు ప్రత్యేక అలంకరణలు చేసి ఎద్దులను పరుగులు తీసేందుకు సిద్ధం చేశారు. రాయకోట, శూలగిరి, బాగలూరు తదితర ప్రాంతాల నుంచి వందలాది ఎద్దులకు, వాటి కొమ్ములకు వివిధ అలంకరణలు చేశారు. ఎడ్ల పండుగను వీక్షించేందుకు వందమందికి పైగా పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్తగా ప్రైవేట్ ఆసుపత్రి అంబులెన్సులు ఏర్పాటు చేశారు. వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.



ఎడ్ల పండుగలో పాల్గొన్న ప్రజలు

కేంద్ర ప్రభుత్వం తీరు అప్రజాస్వామికం

ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు



విలేకరులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రు

రాయచూరు, మార్చి 5 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారిందని ఆమ్ ఆద్మీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు ఆరోపించారు. నరేంద్ర మోదీ 2024 ఎన్నికల్లో తిరిగి అధికారంలోకొస్తే దేశంలో ప్రత్యేక్ష ఎమర్జెన్సీ తప్పదని హెచ్చరించారు. ఏకవ్యక్తి పాలన ఏక వ్యక్తి నిర్ణయం అంటు సాగే ఈ పరిపాలన హిట్లర్‌ను మించి సాగే ప్రమాదం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన జిల్లా నాయకులతో కలిసి విలేఖరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తనకు గిట్టని రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా బీజేపీయేతర ప్రభుత్వాల పట్ల అనుసరిస్తున్న తీరు అత్యంత విచారకరంగా ఉందన్నారు. గవర్నర్‌లను అడ్డం పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాల పై పెత్తనం చేసే ప్రయత్న ప్రమాదకరమన్నారు. తమ పార్టీకి వచ్చే లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులు ఉన్న కారణంగా వారు ఆహ్వానించిన చోట ఆ పార్టీ తరపున ప్రచారం చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

తాగు నీటి ఎద్దడి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలి

● రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ

రాయచూరు, మార్చి 5: నియోజక వర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రూరల్ ఎమ్మెల్యే, ఎస్టీ అభివృద్ధి మండలి అధ్యక్షుడు దద్దల బసనగౌడ అన్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం తాగునీటి సమస్యకు సంబంధించి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ అధికారులు నీటి పారుదల శాఖ, తాగునీటి విభాగాలు చూసే అధికారులు సమన్వయంతో పని చేసి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే వేసవి కాలం ఆరంభమైన నేపథ్యంలో తీవ్ర నీటిఎద్దడి ఉండే గ్రామాలను గుర్తించి తక్షణం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే ట్రాక్టర్‌లను అద్దెకు తీసుకుని వాటికి జీపీఎస్ అమర్చాలన్నారు. అవసరమైన చోట ప్రైవేటు బోర్‌లను లీజ్ పద్దతిలో తీసుకోవాలన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

కస్తూరి శివరావు (జయంతి)



తొలితరం కామెడీ నటులలో పేరొందిన కస్తూరి శివరావు 1913 మార్చి 6న కాకినాడలో జన్మించారు. తెలుగు సినీ రంగంలో నటుడిగా, కమెడియన్‌గా, నేపథ్య గాయకుడిగా, నిర్మాత, దర్శకుడిగా రాణించారు. మూకీ సినిమాలకు వ్యాఖ్యానం చెప్పేవారిగా కెరీర్ ప్రారంభించి టాకీ సినిమాలలో సత్తా చాటుకున్నారు. స్వర్గసీమ, గుణసుందరి సినిమాలు ఎంతో పేరుతెచ్చాయి. రేలంగి, రమణారెడ్డి, రాజబాబులకంటే ముందుతరం నటుడు. తనదైన మేనరిజం, డైలాగ్‌తో గుర్తింపు పొందారు. అవసాన దశలో పేదరికం అనుభవించి అనామకుడిగా మృతి చెందడం దురదృష్టకరం. 1966 ఫిబ్రవరి 24న కన్నుమూశారు.

పెండ్యాల నాగేశ్వరరావు (జయంతి)



ఇంటిపేరుతోనే గుర్తింపు పొందిన పెండ్యాల నాగేశ్వరరావు 1917 మార్చి 6న కృష్ణా జిల్లా ఒణకూరులో జన్మించారు. తెలుగు చిత్రాలకు దొరికిన అద్భుత సంగీత దర్శకులలో ఒకరు. తెలుగు సినిమా సంగీతాన్ని గగనదిశకు తీసుకెళ్లి తారాపథంలో నిలబెట్టి ఆచంద్రతారార్కం ఆ మధురసంగీతాన్ని వింటూ పరవశిస్తూ పాడుకునేలా చేసిన ఘనత సంగీత స్మామ్రాట్ పెండ్యాలగారికే దక్కుతుంది. ఆయన వేల పాటలలో తెలుగుదనం ఉట్టిపడుతుంది. కెరీర్ ప్రారంభంలో సహాయ సంగీత దర్శకుడిగా పనిచేశారు. సన్నివేశాన్ని అర్థం చేసుకుని అందుకు తగినట్టుగా ట్యూన్ వచ్చేవరకూ గాయనీ గాయకులచేత పాడించడం ఆయన ప్రత్యేకత. 1984 ఆగస్టు 31న కన్నుమూశారు.

కృష్ణకుమారి (జయంతి)



పాతతరం సినిమా కథానాయిక కృష్ణకుమారి 1933 మార్చి 6న పశ్చిమబెంగాల్ రాష్ట్రం నౌహతిలో జన్మించారు. షావుకారు జానకి ఈమెకు పెద్దక్క. వేదాంతం జగన్నాథశర్మ వద్ద శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 25 సంవత్సరాలకుపైగా 150కుపైగా సినిమాలలో నటించారు. అలనాటి హీరోలు ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్ తదితర వారితో పలు సినిమాలలో నటించారు. ప్రత్యేకించి కాంతారావుతో 28 జానపద చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ, నంది పురస్కారాలు అందుకున్నారు. 2018 జనవరి 24న కన్నుమూశారు.

గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ (జయంతి)



నోబెల్ పురస్కార గ్రహీత గాబ్రియెల్ గార్సియా మార్క్వెజ్ 1927 మార్చి 6న జన్మించారు. కొలంబియా దేశానికి చెందిన ఆయన నవలా రచయిత, చిన్నకథల రచయితగా, స్క్రీన్‌రైటర్‌గా, జర్నలిస్ట్‌గా పేరొందారు. కటువుగా ఉండే విషయాన్నయినా ప్రేమగా చెప్పాలంటారు. ప్రపంచ సాహిత్యానికి విలువకట్టలేని ఎన్నో సాహిత్య రచనలు అందించిన ఆయన 'మార్మిక వాస్తవవాదం' పేరిట సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. విమర్శకులతోపాటు సామాన్య పాఠకుల మన్ననలు పొందారు. 1982లో నోబెల్ పురస్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 2014 ఏప్రిల్ 17న కన్నుమూశారు.

చెన్నై, కీళక్కరైలో ఎన్ఐఏ సోదాలు

అడయార్, మార్చి 5: సంచలనం సృష్టించిన బెంగళూరు రామేశ్వరం కేఫ్ పేలుడు ఘటనతో పాటు బెంగుళూరు పరప్పణ అగ్రహార సెంట్రల్ జైలులో లష్కరే తోయిబా ఖైదీలకు ఉగ్రవాద భావజాలం బోధిస్తున్నట్టు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఎన్ఐఏ నగరంలోని మన్నడి, రామనాథపురం జిల్లా కీళక్కరై సహా దేశ వ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించింది. చెన్నైలో జరిగిన సోదాల తర్వాత ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. కీళక్కరైలో జరిపిన సోదాల్లో ఒక ల్యాప్‌టాప్‌తో పాటు పలు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. బెంగళూరు రామేశ్వరం కెఫెలో పేలుళ్ళ తర్వాత అప్రమత్తమైన ఎన్ఐఏ దేశంలోని ఉగ్రవాద సానుభూతిపరులున్న ప్రాంతాల్లో సోదాలు చేస్తోంది. చెన్నై నగరంలో మన్నడి, రామనాథపురం జిల్లా కీళక్కరైలో ఈ తనిఖీలు జరిగాయి. మన్నడిలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ కోసం తమ వెంట తీసుకెళ్ళారు. అలాగే, కీళక్కరైలో కూడా పలు ఇళ్లల్లో సోదాలు చేసిన ఎన్ఐఏ అధికారులు... ఒక ల్యాప్‌టాప్ సహా ఆరు సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్ఐఏ అధికారులు మొత్తం ఏడు రాష్ట్రాల్లో 17 చోట్ల సోదాలు చేశారు.

జయ నగల అప్పగింతపై హైకోర్టు స్టే

పెరంబూర్, మార్చి 5: దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నగలు తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించడంపై తాత్కాలిక స్టే విధిస్తూ కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఆస్తుల కేసులో జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, వజ్రాలతో కూడిన నగలు కర్ణాటక ప్రభుత్వ ట్రెజరీలో ఉంచారు. జయలలిత నగలను వేలం వేయాలనే పిటిషన్ విచారించిన బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం, జయలలిత నగలు తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించాలని, ఈ కేసును తమిళనాడు నుంచి కర్ణాటకకు మార్చినందున కేసు ఖర్చుల కోసం రూ.5 కోట్లు తమిళనాడు ప్రభుత్వం కర్ణాటకకు చెల్లించాలని ఇటీవల తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో, జయలలిత నగలు తమిళనాడు ప్రభుత్వానికి అప్పగించే తీర్పుపై స్టే విధించాలని కోరుతూ దీప, దీపక్‌లు కర్ణాటక హైకోర్టులో పిటీషన్ వేశారు. పిటీషన్‌ను మంగళవారం విచారించిన హైకోర్టు, ప్రత్యేక న్యాయస్థానం తీర్పుకు తాత్కాలిక స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

మంత్రి ఉదయనిధికి బెంగళూరు కోర్టు సమన్లు

పెరంబూర్, మార్చి 5: సనాతన ధర్మంపై మంత్రి ఉదయనిధి వ్యాఖ్యలను ఖండిస్తూ, కర్ణాటక రాష్ట్రం బెంగుళూరుకు చెందిన పరమేశ్ 42వ అదనపు ప్రిన్సిపల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటీషన్ గత ఫిబ్రవరి 2వ తేదీ విచారణకు రాగా మార్చి 4న కోర్టుకు హాజరుకావాలని ఉదయనిధికి సమన్లు జారీ చేసింది. సోమవారం న్యాయమూర్తి జే ప్రీత్ ధర్మాసనం ముందు విచారణకు మంత్రి ఉదయనిధి హాజరుకాలేదు. దీంతో ఏప్రిల్ 26న విచారణకు హాజరుకావాలని న్యాయమూర్తి రెండో సారి సమన్లు జారీచేశారు.

బోధనా సమయంలోనే నైపుణ్యానికి మెరుగులు

» ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బోధనా సమయంలోనే నైపుణ్యానికి మెరుగులు దిద్దడం ద్వారా ఐటీ, పారిశ్రామిక రంగానికి అవసరమైన మానవ వన రులను అందించేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టామని ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తెలిపారు. కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యం లో మంగళవారం జరిగిన మంథన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగిస్తూ ఉద్యోగాలను మరింతగా సృష్టించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఇది బాగా దోహదపడుతుందన్నారు. ఇందులో భాగంగా వాద్వాణి ఫౌండేషన్, టయోటా కిర్లోస్కర్ వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు. విద్యార్జన వేళ నైపుణ్యం పెంచుకోవడం ద్వారా ఉపాధి, ఉద్యోగాలు పొందడం సాధ్యమన్నారు. ఈ దిశగా ప్రభుత్వానికి సంస్థలు సహకరించడం సంతోషమన్నారు. సమాఖ్య అధ్యక్షుడు రమేశ్‌చంద్ర లహోటి, మంథన్ చైర్మన్ ఎం కీర్తన్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షుడు ఎంజీ బాలకృష్ణ, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. మంథన్ సమావేశంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా భాగస్వామ్యులయ్యారు.



జ్యోతి ప్రజ్వలనలో మంత్రి సుధాకర్ తదితరులు

ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశం సురక్షితం

» ఎమ్మెల్యే ఎస్ రఘు



వృద్ధులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం, రాష్ట్రం సురక్షితంగా ఉంటాయని బీజేపీ ఎమ్మెల్యే ఎస్ రఘు పేర్కొన్నారు. సర్ సీవీ రామన్‌నగర్ నియోజకవర్గానికి చెందిన సెల్ఫ్‌హెల్ప్ మహిళా గ్రూప్‌లకు మంగళవారం ఆయన రూ. 1.60 కోట్ల మేరకు రుణాలను పంపిణీచేశారు. న్యూతిప్పసంద్రలో జరిగిన కార్యక్రమంలో 11 సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్‌లకు చెందిన 110 మంది మహిళలకు తలా రూ 1 లక్ష చొప్పున, 3 గ్రూపులకు చెందిన 60 మంది మహిళలకు తలా రూ.2 లక్షల చొప్పున రుణం మొత్తాలను ఆయన అందజేసి అభినందించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఈ రుణాలను అందించామని వీటిని సద్వినియోగం చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని ఎమ్మెల్యే రఘు పిలుపునిచ్చారు. అంతకుముందు ఆయన 10 మంది వృద్ధులకు ఉచితంగా మూడు చక్రాల కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన ప్రధాని మోదీ నాయకత్వానికి దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మోదీ వంటి గొప్ప నేత మనకు లభించడం దేశ ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. కాగా పాకిస్థాన్ జిందాబాద్ నినాదాలు చేసిన దేశద్రోహుల్ని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని దేశద్రోహులు సంఘవిద్రోహకుల కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని ఆయన ఆరోపించారు.

జలజీవన్ మిషన్ పనులకు శ్రీకారం

మహదేవపుర, మార్చి 5: నియోజకవర్గ పరిధిలోని పలుగ్రామాలలో నీటి సమస్య పరిష్కరించేలా జలజీవన్ మిషన్ పథకం పనులకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి శ్రీకారం చుట్టారు. ఆవలహళ్ళి, బండాపుర, కన్నమంగళ, ఖాజిసొన్నేనహళ్ళి, గొరవగెరె, బొమ్మెనహళ్ళి, రఘువనహళ్ళి, హంచరహళ్ళి, కట్టుగొళ్ళహళ్ళి, బండెబొమ్మసంద్ర, హళేహళ్ళి, కిత్తగనూరు గ్రామాలలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ నీరు అందించేలా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ హోబళి అధ్యక్షుడు నటరాజ్, ప్రముఖులు పాపణ్ణ, కెంపేగౌడ, వేణు, జనార్ధన్‌గౌడ, మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజలో ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

హిందూత్వ ఫాసిస్ట్ బీజేపీని ఓడించండి



సమావేశంలో భారత మార్క్సవాద, లెనిన్ వాద పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసవలింగప్ప

బాగేపల్లి, మార్చి 5: రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో ఉన్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తొలగించాలని, హిందూత్వ ఫాసిస్ట్ ధోరణితో ఉన్న బీజేపీని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఓడించాలని భారత మార్క్సవాద లెనిన్ వాద పార్టీ రాష్ట్ర కార్యదర్శి బసవలింగప్ప పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం మీడి యాతో మాట్లాడుతూ కార్పొరేట్ పాలసీలతో వ్యవసాయ, సేవా రంగాలు ప్రైవే ట్ పరంగా మారాయన్నారు. విద్య, ఆరోగ్యం సామాన్యులకు అందడం లేదన్నారు. పేదరికం, నిరోద్యగం, నిత్యావసరాల ధరలతో సామాన్యులు తల్లడిల్లుతున్నారన్నారు. అంతేకాకుండా ఇతర మతాలను ద్వేషిస్తున్నారని ఆక్రోశం వ్యక్తం చేశారు. తాలూకాలో 2008లో ప్రభుత్వ భూములు సాగు చేస్తున్న భూమిలేనివారికి సాగుచీటీలు ఇచ్చారని, ఫారం 50, 53, 57 నమూనాలలో అర్జీలు సమర్పించిన పేదలకు బదులుగా ప్రభుత్వ భూముల్లో సాగు చేసిన వారికే పట్టాలు ఇవ్వడం సరికాదన్నారు. పదేళ్లుగా పేదలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేయడం లేదన్నారు. తాలూకాలోని గూళూరు గ్రామ సర్వే నెంబరు 380, 345, 382లలో 24 ఎకరాల భూమిని ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్న పేద లకు అన్యాయం చేశారన్నారు. సదరు భూమిని ప్రాబల్యం కల్గినవారికి దక్క డం ఖండనీయమని ఆక్రోశం వ్యక్తం చేశారు. తాలూకాలో పలు చోట్ల ప్రభుత్వ, పేదల భూములు రియల్టర్‌లు, రాజకీయ ప్రభావితులు భూమిని కబ్జా చేశారని దీనిపై దర్యాప్తు చేసి పేదలకు న్యాయం చేయాలన్నారు. తాలూకా వ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, కనీసం కూలి మొత్తాన్ని రూ.600కు పెంచాలన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను వాపసు తీసుకోవాలన్నారు. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, పోస్టులను భర్తీ చేయాలన్నారు. తాలూకాలో సమగ్ర నీటి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు, జిల్లా కార్యదర్శి చిన్నకాయలపల్లి రామచంద్రప్ప, టీబీ క్రాస్ చలపతి, రామరెడ్డి, గూళూరు శ్రీనివాస్, అనిల్, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు చర్యలు

బంగారపేట, మార్చి 5: వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే నారాయణస్వామి సూచించారు. తాలూకా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటైన పీడీఓల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని ఏ గ్రామంలోనూ నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర నిర్వహణ చేయాలని అధికారులకు సూచించినట్టు తెలిపారు. తాను కూడా పట్టణమైనా, గ్రామమైనా సమస్యల పరిష్కారానికి అవసరమైతే వెంటనే పరిశీలిస్తానన్నారు. ఇప్పటికే నాలుగైదు గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి బోర్లు తవ్వించాలని సూచించామని, కొన్ని చోట్ల పంప్‌సెట్లకు విద్యుత్ కనెక్షన్ సమస్యపై బెస్కాం ఇంజనీర్లతో చర్చలు జరిపి తగిన సూచనలు చేసినట్టు తెలిపారు. సమావేశంలో తహసీల్దార్ రశ్మి, తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి రవికుమార్, అన్ని గ్రామపంచాయతీల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.



పీడీఓల సమావేశంలో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తదితరులు

లబ్ధిదారులకు పంపుసెట్ల పంపిణీ



పంప్‌సెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, మార్చి 5: బోవి అభివృద్ధి మండలి నుంచి గంగా కల్యాణ పథకం కింద 2018-19 సంవత్సరానికి ఎంపికైన రైతులకు మోటర్ పంప్‌సెట్లను ఎమ్మెల్యే రవికుమార్ అందజేశారు. పట్టణంలోని ప్రవాసిమందిరంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక సమస్యల కారణంగా పంపిణీ జాప్యమైందన్నారు. ఇటీవలికాలంలో భూగర్భజలాలు అడుగంటాయని బోరుబావులలోనూ నీటిమట్టం తగ్గిందన్నారు. దీని ప్రభావం సాగు చేయడంపై తీవ్రంగా చూపిందన్నారు. బోరుబావిని తవ్వించి విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మోటర్ పంపు అమర్చడానికి ఆర్థికంగా చాలామంది రైతులు వెనుకబడ్డంతో గంగా కల్యాణ పథకం వారికి వరం కానుందన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ప్రామాణికత పాటిస్తున్నామన్నారు. ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసిందని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్మశాన ఆక్రమణలు తొలగించండి

బంగారపేట, మార్చి 5: తాలూకాలోని కారహళ్ళి, యలబుర్గి, తిమ్మాపుర గ్రామాలకు చెందిన వీరశైవ లింగాయత శ్మశాన ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కారహళ్ళి నుంచి తిమ్మాపుర గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుపక్కనే ఉన్న ఈ స్మశానం మినహా మరొకటి లేదని, దీన్ని కూడా కొందరు ఆక్రమించారని గ్రామస్థుడు అరుణ్ ఆరోపించారు. పట్టణంలో తాలూకా కార్యాలయంలో తహసీల్దార్ రశ్మికు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం గ్రామస్థులు మీడియాతో మాట్లాడుతూ మూడు గ్రామాలకు చెందిన స్మశాన ప్రాంతాన్ని సర్వే చేయించి ప్రహరీ నిర్మించాలని కోరామన్నారు. వీరశైవ సముదాయ గౌరవాధ్యక్షుడు చంద్రకుమార్, అధ్యక్షుడు రవీంద్ర, ఉపాధ్యక్షుడు అరుణ్‌కుమార్, సహకార్యదర్శి కిరణ్ సీ లోకేశ్, రవికుమార్, ఉదయ్‌కుమార్, ఉమేశ్ తిమ్మాపుర పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

బీఐటీఎం ఆధ్వర్యంలో

ఉత్సాహంగా పునర్‌మిలన

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బళ్ళారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజిమెంట్ తన వార్షిక పునర్‌మిలన 2024 కార్యక్రమాన్ని నగరంలో ఆదివారం ఏర్పాటు చేసింది. వేదికపై పారిశ్రామిక రంగంలో అద్భుతమైన ప్రగతి అందుకున్న పూర్వ విద్యార్థి సిద్ధార్థ్ ఇంజేటిని ఘనంగా సత్కరించారు. సిద్ధార్థ్ ప్రసంగిస్తూ పాన్ ఇండియాలో హిందీ, తెలుగు సినిమాలకు దర్శకత్వం వహించాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ప్రేక్షకుల హృదయాలు గెలిచేలా వినూత్న కథాంశాలను సిద్ధం చేస్తున్నామన్నారు. సిద్ధార్థ్ సృజనాత్మకతతో వచ్చిన తలాబ్, ఏక్ రూసికి దాస్తాన్, బిజిలి వంటి సీరియల్స్ ఓటీటీ వేదికపై బహుళ ప్రజాదరణ పొందిన సంగతి తెలిసిందే. పునర్‌మిలన సందర్భంగా 15 వెబ్ సిరీస్‌ల సక్సెస్ డైరెక్టర్ సిద్ధార్థ్‌ను సన్మానించిన అనంతరం విద్యార్థులు ఆయనతో చర్చాగోష్ఠి జరిపారు. పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసుకున్నారు. ఆయా రంగాల లో వారు సాధించిన సాధనలను వివరించారు. పలువురికి మార్గదర్శకం చేశారు. పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలుకూడా ఉత్సాహంగా సాగాయి.



వేదికపై ప్రముఖులు

మైసూరు ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్

చైర్మన్‌గా మనోహర్ బాధ్యతలు



మనోహర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ సంస్థ 'ది మైసూరు ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్' చైర్మన్‌గా నియమితులైన సీనియర్ కాంగ్రెస్ నేత ఎస్ మనోహర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్, మాజీ ఎమ్మెల్యే నె ల నరేంద్రబాబు, మాజీ మేయర్ జే హుచ్చప్ప, ప్రముఖ సినీ నిర్మాత సారా గోవింద, బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ ఎస్ కేశవమూర్తితో కాంగ్రెస్ నేతలు పరిసర రామకృష్ణ, జనార్ధన్, ఆనంద్, సుధాకర్ తదితరులు నూతన చైర్మన్‌కు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో 30 సంవత్సరాలుగా ఒక సామాన్య కార్యకర్తగా సేవలందిస్తున్నానని తన సేవలను గుర్తించి ఈ కీలక పదవి అప్పగించినందుకు పార్టీ అధిష్ఠానం పెద్దలకు, ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ 5 గ్యారెంటీ పథకాలతో అన్నివర్గాల నిరుపేద, మధ్యతరగతి ప్రజలకు బాగా చేరువైందని దీనిని సహించలేక ప్రభుత్వంపై ప్రతిపక్షమైన బీజేపీ బురద జల్లుతోందని ఆరోపించారు.

మహిళా సాధికారత కోసం ప్రత్యేక శిబిరం



బైక్‌పై ట్రయల్‌రన్ చేస్తున్న మహిళ

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయల్ బ్రదర్స్, మొబిలైజ్ యువర్ గ్రోత్ మోటో బిజినెస్ సర్వీస్ ఇండియా సంస్థలు సంయుక్తంగా బెంగళూరులో ఆసక్తిగల మహిళల కోసం మోటర్‌సైకిల్, స్కూటర్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వరుసగా ఏడోసారి నగరంలో మహిళలకోసం ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు సంస్థ సీఈఓ అభిషేక్ చంద్రశేఖర్ మీడియాకు తెలిపారు. సుమారు వంద మందికిపైగా మహిళలు, యువతులు ఏడో ఎడిషన్ శిక్షణా శిబిరంలో పాల్గొని మోటర్ సైకిళ్ల ట్రయల్‌రన్‌లో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎంబీఎస్ఐ సీఈఓ నకావు హిరోషితోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ఉల్లూరుపేట

ఎంపీసీఎస్ అధ్యక్షుడిగా పురుషోత్తమ్



అధ్యక్ష, ఉపాధ్యక్షులతో డైరెక్టర్‌లు తదితరులు

శిడ్లఘట్ట, మార్చి 5: తాలూకాలోని ఉల్లూరుపేట ఎంపీసీఎస్ అధ్యక్షుడిగా ఆర్ పురుషోత్తమ్ ఎన్నికయ్యారు. పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఆర్ పురుషోత్తమ్, ఉపాధ్యక్షుడిగా ఎం తేజస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదేళ్లపాటు కొనసాగే పాలకవర్గానికి ఫిబ్రవరి 23న 12 మంది డైరెక్టర్‌ల స్థానాలకు ఎన్నికలు జరిగాయి. పురుషోత్తమ్, నాగరాజ, బీ నారాయణస్వామి, తేజస్ ఎం, కిరణ్‌కుమార్, కే మునిరెడ్డి, వేణుగోపాల, కే నారాయణస్వామి, రమేశ్, కేటీ నటరాజ్, అశ్వత్థమ్మ, నళిని ఎన్నికయ్యారు. తాజాగా అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా లీలావతి వ్యవహరించారు.

ట్యూన్ కోర్

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

బెంగళూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ డిజిటల్ సంగీత కంపెనీలో ఒకటైన ప్యారిస్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న బిలీవ్ నిర్వహణలోని ట్యూన్‌కోర్ ట్రస్ట్ తన మూడో ఎడిషన్ సేవా కార్యక్రమాలను నగరంలో ప్రకటించింది. దక్షిణాది భాషలైన కన్నడ, తెలుగు, తమిళ, మళయాళంలో ప్రదర్శనలు ఇచ్చే నలుగురు స్వతంత్ర కళాకారులను గుర్తించి తలా లక్ష రూపాయల అవార్డును అంద చేయనున్నారు. ఆసక్తిగల కళాకారులు ఈ అవార్డుకోసం మార్చి 31లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ట్యూన్‌కోర్ ఇండియా వెబ్‌సైట్‌లో ఇందుకు సంబంధించిన సమగ్ర వివరాలను పొందుపరిచినట్టు సంస్థ వెల్లడించింది. సంగీతరంగ దిగ్గజాలైన సీఎస్ శ్యామ్, ఫిబ్రాన్, నేహానాయర్, ఎన్ఎస్ పద్మనాభన్‌లతో కూడిన బృందం అర్హులైనవారిని ఎంపిక చేయనుంది. 2022లో ప్రారంభమైన ట్యూన్‌కోర్ ట్రస్టు సంగీతరంగంలో అనేకమంది ప్రముఖులను గుర్తించి వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. ట్యూన్‌కోర్ కళాకారులు 25కుపైగా స్థానిక భాషలలో తమ సంగీత ఆల్బమ్‌లను ఆవిష్కరించారని సంస్థ దక్షిణ ఆసియా ప్రముఖురాలు అఖిలా శంకర్ ప్రకటనలో పేర్కొన్నారు.

చిలకల నేర్పు డెయిరీ అధ్యక్షుడిగా శేఖర్

చేళూరు, మార్చి 5: తాలూకాలోని చిలకలనేర్పు గ్రామ పాల డెయిరీ సహకార సంఘం అధ్యక్షుడిగా బీ శేఖర్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ మద్దతుదారులు 12మంది, మరొక వ్యక్తి కలసికట్టుగా అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు మంజునాథ్, నటరాజ్, పురుషోత్తమరావు, బైరెడ్డి ఈశ్వరప్ప, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నూతన అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఎన్నికల అధికారిగా రమేశ్ వ్యవహరించారు.

విద్యుత్ తీగలు తగిలి కాంక్రీట్ మిక్సర్‌కు మంటలు



కాలిపోయిన వాహనం ఇదే...

దొమ్మసంద్ర, మార్చి 5: సర్జాపుర ప్రధాన రహదారిపై సులికుంటె కాలనీ సమీపాన కాంక్రీట్‌మిక్సర్ వాహనానికి విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి కాలిపోయింది. మంగళవారం చోటు చేసుకున్న ఘటనలో సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో చేరుకుని మంటలు ఆర్పివేశారు. వాహన డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం వాటిల్లలేదని బెళ్ళందూరు అగ్నిమాపక అధికారి సంపత్‌కుమార్ తెలిపారు. ప్రధాన రహదారిపై విద్యుత్‌తీగలు వాలి ఉండడంతోనే సమస్య కారణమైందనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే బెస్కాం అధికారుల దృష్టికి తెచ్చినా నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం ఏర్పడిందనే విమర్శలు ఉన్నాయి.